


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

ఆదివారం | 30 | ఆగస్టు | 2026 | పేజీలు: 08


## క్రీడా ప్రతిభను చాటాలి

### ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

### హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి అర్పించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, అక్షిత బ్యూరో:** భారత హాకీ దిగ్గజం, హాకీ విజార్డ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. భారత హాకీ రంగానికి ఆయన అందించిన సేవలు, దేశానికి ..మిగతా 2లో



## బడుల పటిష్టతకు కృషి

### 100% విద్యార్థుల హాజరే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ 100% శాతం బడికి వచ్చేలా ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. శనివారం దహేగాం మండలంలోని చిన్న రాష్పల్లి గ్రామంలో ఉన్న ఎం.పి.పి.ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, టాయిలెట్లు, రక్షిత మంచినీటి వసతి మరియు పరిసరాల పరిశుభ్రతను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల దినసరి హాజరు రిజిస్టర్లను తనిఖీ చేసి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు ..మిగతా 2లో

## పారదర్శకంగా నోటీసుల జారీ ప్రక్రియ

### సంబంధిత వ్యక్తులకు మాత్రమే నోటీసులు అందజేసి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలి

### ఇప్పటివరకు 75 శాతం నోటీసుల జారీ ప్రక్రియ పూర్తి

### కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూలు అక్షిత ప్రతినిధి:** ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సంబంధిత వ్యక్తులకు మాత్రమే నోటీసులు అందజేసి, వారు నోటీసు స్వీకరించినట్లు తప్పనిసరిగా అక్నాలెడ్జ్ మెంట్ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 75 శాతం నోటీసుల జారీ ప్రక్రియ ..మిగతా 2లో

## సవాళ్లను అధిగమించి లక్ష్యాలను సాధించాలి

### కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,అక్షిత బ్యూరో :** విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా స్వీకరించి, సరైన మార్గంలో పయనిస్తూ తమ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల కేంద్రీయ విద్యాలయంలో ..మిగతా 2లో



## పక్కాగా సెన్సస్ హ్యాండ్ బుక్

### సెన్సస్ హ్యాండ్ బుక్ సమాచారం ఆన్‌లైన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** సెన్సస్ హ్యాండ్ బుక్ మ్యానువల్ సమాచారం మొత్తాన్ని ఆన్ లైన్ చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ..మిగతా 2లో

## క్రీడా ప్రతిభను చాటాలి




**మొదటి పేజీ తరువాయి...**

సాధించిన విజయాలను స్మరించుకున్నారు.క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.యువత క్రీడల్లో ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు జిల్లాలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి, ఆర్డిఓలు వరంగల్ సుమ, నర్సంపేట ఉమారాణి ఒలంపిక్ అసోసియేషన్ సెక్రెటరీ కైలాసం యాదవ్, డి వై ఎస్ ఓ అనిల్ కుమార్, అన్నీ మండలాల తాసిల్దార్లు కొచ్ లు కలక్టరేట్ స్టాఫ్ మరియు క్రీడకారులు పాల్గొన్నారు.

## బడుల పటిష్టతకు కృషి




**మొదటి పేజీ తరువాయి...**

తీసుకుంటోందన్నారు. బడుల్లో అవసరమైన మౌలిక వసతులను వేగంగా కల్పిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా, నాణ్యమైన విద్యనందించే ప్రభుత్వ బడులకే పంపించేలా వారికి అవగాహన కల్పించాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో సైతం నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్య అందుబాటులో ఉందనే విషయాన్ని గ్రామీణ ప్రాంత ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం గ్రామ పెద్దలు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా సెన్సస్ హ్యాండ్ బుక్




**మొదటి పేజీ తరువాయి...**

ఆదేశించారు. శనివారం నిజామాబాదు నుంచి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మండలాలు, మున్సిపాలిటీల వారిగా ఇప్పటివరకు సేకరించిన నిర్దేశిత సమాచారం, ఇంకా సేకరించాల్సిన వివరాలు అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. సేకరించిన సమాచారాన్ని మొత్తం నిర్దేశిత ప్రొఫార్మాలో ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. సేకరించే, ఆన్ లైన్ చేసే సమాచారం మొత్తం తప్పులు లేకుండా ఉండాలన్నారు. వివిధ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ఈ వీసీలో జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సిపిఓ గంగారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా నోటీసుల జారీ ప్రక్రియ

**మొదటి పేజీ తరువాయి...**




పూర్తయిందని తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలన, నోటీసుల జారీ, హియరింగ్ నిర్వహణ తదితర అంశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు.అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ ... బీఎల్ఓలు నోటీసులను సంబంధిత వ్యక్తులకు మాత్రమే అందజేసేలా ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నోటీసులు అందజేసిన అనంతరం సంబంధిత వ్యక్తి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవడంతో పాటు, ప్రక్రియకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. నోటీసుల జారీ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. నోటీసులు అందజేసిన తర్వాత హియరింగ్ ప్రక్రియను కూడా ముందస్తు ప్రణాళికతో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. హియరింగ్‌కు రెండు రోజుల ముందే సంబంధిత ఓటర్లకు మరోసారి సమాచారం అందించి, హియరింగ్ తేదీ, సమయం గురించి గుర్తు చేయాలని సూచించారు. దీంతో ఓటర్లు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో నిర్ణీత సమయానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.ఓటర్లు హియరింగ్ సమయంలో సమర్పించాల్సిన ధ్రువీకరణ పత్రాల విషయంలో కూడా వారికి ముందుగానే స్పష్టత ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒక ధ్రువీకరణ పత్రం మరియు ఆధార్ ను సమర్పిస్తే సరిపోతుందనే విషయాన్ని ఓటర్లకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. దీనివల్ల పత్రాల సమర్పణపై ఓటర్లలో అనవసరమైన గందరగోళం లేకుండా చూడవచ్చని తెలిపారు. నోటీసు కు సంబంధించి ఏ ధ్రువీకరణ పత్రం అవసరం అవుతుందో ఓటరుకు ముందుగానే తెలియజేయడని తెలిపారు.కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏఈఆర్ఓలకు హియరింగ్ నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. హియరింగ్ సమయంలో పాటించాల్సిన విధివిధానాలు, పత్రాల పరిశీలన, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై వారికి పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించా రు. అనామలీస్, నో మ్యాపింగ్‌కు సంబంధించిన వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కూడా నిబంధనల మేరకు పంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ, సంబంధిత సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు.ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసినప్పటికీ కొంతమంది ఓటర్లు నో మ్యాపింగ్‌లో ఉన్నట్లు గుర్తించిన సందర్భాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అన్నారు. ఒక చిరునామాలో నివసిస్తున్న వ్యక్తులను మరో చిరునామాలో చూపించడం, ఒక చిరునామాలో నివసించని వ్యక్తులను అదే చిరునామాలో ఉన్నట్లు నమోదు చేయడం వంటి అంశాలు వెలుగులోకి వస్తే సమగ్రంగా విచారణ చేపట్టాలని సూచించారు. ఇలాంటి తప్పిదాలు సంబంధిత బీఎల్ఓల నిర్లక్ష్యం లేదా తప్పిదం వల్ల జరిగినట్లు నిర్ధారణ అయితే, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నోటీసులు అందజేసిన తర్వాత సంబంధిత వ్యక్తులకు తమ వివరణను తెలియజేయడంతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించేందుకు ఏడు రోజుల సమయం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో ఓటర్ల జాబితాలోని తప్పిదాలను నిబంధనల ప్రకారం సరిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.నోటీసుల జారీ నుంచి హియరింగ్ వరకు ప్రతి దశను నిబంధనల ప్రకారం, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఆర్ఓలు, సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# సవాళ్లను అధిగమించి లక్ష్యాలను సాధించాలి

**మొదటి పేజీ తరువాయి...**

మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలకు మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంతో పోల్చితే కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థుల సంఖ్య దాదాపు రెట్టింపు కావడం సంతోషంగా ఉందని, ప్రస్తుతం 600 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. వివిధ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యాలకు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలిసి చదువుకోవడం, పరస్పరం నేర్చుకోవడం వల్ల వారి వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పాఠ్యాంశాలతో పాటు క్రీడలు, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థులలో సమగ్ర వ్యక్తిత్వం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.




పాఠశాల జీవితం భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేసే వేదిక అని తెలిపారు. జీవితంలో లక్ష్యాలను సాధించడం కొరకు సరైన మార్గంలో పయనించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. విద్యతో పాటు సంగీతం, నృత్యం, క్రీడలు, చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి వివిధ రంగాలలో పాల్గొనడం ద్వారా సమగ్ర వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలలో చిన్న వయసు నుంచే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం అభినందనీయమని, జీవితంలోని ప్రతి రంగంలోనూ నాయకత్వ లక్షణాలు అవసరమని తెలిపారు. 5--6 సంవత్సరాల వయసు నుండి పిల్లలలో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, క్రమశిక్షణ, బాధ్యతాయుత భావనలను పెంపొందించాలని తెలిపారు. కేంద్ర విద్యాలయాల విధానం దేశవ్యాప్తంగా విద్యార్థులకు బహుభాషా, బహుసాంస్కృతిక, బహుప్రాంతీయ వాతావరణాన్ని కల్పిస్తుందని, కుల, మత, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, సహాయక వాతావరణాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్య కేవలం పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకూడదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ద్వారా విద్యార్థులను సంపూర్ణ వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి కుటుంబంతో పాటు గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా, దేశ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను మంచి విద్యాసంస్థలలో చదివిస్తున్నారని, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బియ్యం బాలే.. తినేట్టు లేవు



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** సామాన్యులు తినేవిధంగా ప్రజా పంపిణి వ్యవస్థ రేషన్ బియ్యం సరఫరా చేయాలని కోరుతూ మిర్యాలగూడ డివిజన్ సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ చాంద్ పాషాకు శనివారం మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అందరికీ సన్న బియ్యం ఇవ్వాలని సంకల్పంతో ప్రజలు మొత్తం అందరూ వండుకొని తినాలని ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిన రేషన్ సన్న బియ్యం దళారీల ద్వారా కల్తీ జరుగుతుందన్నారు. బియ్యం ఎక్కడి నుండి వస్తున్నాయో తెలియదన్నారు. బియ్యాన్ని రైస్ మిల్లుల ద్వారా ఎఫ్సిఐ గోదాములకు లేదా సివిల్ సప్లై గోడౌన్లకు మిల్లుల ద్వారా వస్తుంటాయి ఈ బియ్యాన్ని క్వాలిటీ ఇన్స్పెక్టర్లు సెలెక్ట్ చేసి బియ్యాని పాస్ చేసి తర్వాతనే గోడౌన్లోకి దిగుమతి చేస్తారు మరి ఈ బియ్యం అధికారులు వారి స్వార్థాలకు మరిగి నాసిరకం బియ్యాన్ని పాస్ చేసి గోడౌన్లో దిగుమతి చేస్తున్నారు ఆ బియ్యం రేషన్ షాపులకు



డివిజన్ పరిధిలో ఉన్న రేషన్ బియ్యం కాంట్రాక్ట్ లారీల ద్వారా అన్ని రేషన్ షాపులకు తరలిస్తున్నారన్నారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో యాద్గారుపల్లి గ్రామంలో ఒక డీలర్ షాప్ ని పరిశీలించగా 20 బస్తాల వరకు పూరి కోసతో కుట్టిన బస్తాలు దిగుమతి అయినవి ఆ బస్తాలలో బియ్యం దుమ్ము ధూళి పురుగులు కింద పడిన బియ్యాన్ని ఊడ్చి బస్తాలోకి పోసినట్టుగా ఉన్నాయని వారన్నారు కాంట్రాక్టర్ వేరే ఏమైనా అక్రమ దందాలు చేసి బియ్యాన్ని రేషన్ షాపులకు ఏమైనా పంపిస్తున్నారా లేదా అధికారులు పాస్ చేసిన బియ్యాన్ని పంపిస్తున్నారా కాంట్రాక్టర్ అధికారులకే తెలియాలని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం ప్రజలందరికీ అందించాలని ఉద్దేశంతో ప్రవేశపెట్టిన బియ్యాన్ని ప్రజలకు తెలిసే విధంగా మంత్రులు ఎమ్మెల్యేలు అధికారులు అందరూ కలిసి ప్రజలు తినాలని సామూహిక ఇష్టబంతులు పెట్టి ప్రజాప్రతినిధులు అధికారులు అందరూ పాల్గొని సహపంక్తి భోజనం చేయాలని వారన్నారు. రేషన్ షాపుకు వచ్చిన బియ్యాన్ని తింటే ప్రజలు అనారోగ్యాలు హాస్పటల్ పాలు కావడమే తప్ప ప్రభుత్వం చెప్పింది ఒకటి ప్రభుత్వ అధికారులు చేసేది ఒకటని బియ్యాన్ని ఏం చేస్తారో వారే ఆలోచించాలని వారన్నారు. ప్రజలు మాత్రం బియ్యం తినే పరిస్థితి ఉండదు ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు రేషన్ షాపులకు పంపించే బియ్యాన్ని పూర్తిస్థాయిలో పరిశీలన చేసి పంపించాలని మెమోరాండం సిపిఐ ఆధ్వర్యంలో సమర్పించారు. సిపిఐ మండల కార్యదర్శి అంజనపల్లి రామలింగం, గువ్వల మట్టయ్య, ఎస్కే షమీం, ఎస్కే.రహీం, డి.వెంకటేశ్వర్లు, ఉన్నారు

# చెంచుపలుగు తండాలో నూతన రేషన్ షాప్ ప్రారంభం

## మాజీ ఎంపీపీ రామనాథం

**నాగర్ కర్నూలు అక్షిత ప్రతినిధి:** ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్థానికంగా రేషన్ షాప్ కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం చెంచుపలుగు తండాలో నూతన రేషన్ షాప్ ను మాజీ ఎంపీపీ రామనాథం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో రేషన్ షాపు కచ్చితంగా ఉండాలని అచ్చంపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ గారి చొరవతో రేషన్ షాప్ మంజూరు చేశారు . ఇట్టి రేషన్ షాపు మంజూరు కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ రామానాథం హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ



సర్పంచ్ లచ్య నాయక్ , ఉప సర్పంచ్ రవీందర్ చౌహాన్ మాట్లాడుతూ నూతన రేషన్ షాప్‌తో గ్రామ ప్రజలకు, ముఖ్యంగా పేదలు, వృద్ధులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరుఆత్మగౌరవంతో ఉండాలన్నదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

## మాజీ వైస్ ఎంపీపీ నారాయణ గౌడ్

**నాగర్ కర్నూలు అక్షిత ప్రతినిధి:** ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో ఉండాలన్నదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ వైస్ ఎంపీపీ నారాయణ గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అవుసలి కుంట గ్రామంలోని గ్రామపంచాయతీ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రేషన్ కార్డులకు సంబంధించి లబ్ధిదారులకు తాసిల్దార్ బి వెంకటేష్, గ్రామ సర్పంచ్ కోడావత్ ల తో కలిసిలబ్ధిదారులకుస్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వారు



పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో రకాల అభివృద్ధి సంక్షేమ ఫలాలను అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బి వెంకటేష్, గ్రామ సర్పంచ్ కోడావత్ మంగమ్మ, ఉప సర్పంచ్ చాపల మధు, సీనియర్ అసిస్టెంట్ తిరుపతమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎన్ చంద్రయ్య,జిపిఓలు శివ, సతీష్, భాస్కర్, వార్డు సభ్యులు గ్రామ యువకులు లబ్ధిదారులు ప్రజలు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**జడ్చర్ల, అక్షిత న్యూస్:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, పారిశుద్ధ్య, పౌర సేవల కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జడ్చర్ల మున్సిపాలిటీకి చెందిన అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని వివిధ విభాగాల పనితీరు, ఆయా విభాగాల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల స్థితిగతులు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత నిర్వహణ, ప్రజలకు అందుతున్న మున్సిపల్ సేవలు, పన్నులు తదితర ఆదాయ వసూళ్ల పురోగతి, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మున్సిపల్ సేవలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పన్నులు, ఇతర ఆదాయ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనులను నిర్దేశిత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రతి విభాగం తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మున్సిపాలిటీ అభివృద్ధి , ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కీలకపాత్ర పోషించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు.

# శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోటలో వచ్చే నెల 5న నిర్వహించే శ్రీ కృష్ణ జయంతి ఉత్సవ వేడుకల కార్యక్రమానికి రావాలని కొత్తకోట శ్రీ కృష్ణ ఆలయ కమిటీ హైదరాబాదులో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డిని ఆహ్వానించారు. ముందుగా ఎమ్మెల్యే జీయంఆర్ కు మర్యాదపూర్వకంగా శాలువా కప్పి ఆహ్వానాన్ని అందజేశారు. అదేవిదంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి నవీన్ కుమార్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దేశీ పెంటన్న యాదవ్, కౌన్సిలర్ జి మురళి యాదవ్, మాజీ వార్డు నెంబర్ ఎం బాలకొండయ్య యాదవ్, మాజీ టెంపుల్ డైరెక్టర్ పి శంకర్ యాదవ్, జి సాయిరాం యాదవ్, కె మహేష్ యాదవ్, జి మల్లేష్ యాదవ్, తీర్మాలయపల్లి సర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
ఆదివారం |30| ఆగస్టు| 2026

# నాణ్యత ప్రమాణాలు పాటించాలి

## మోడల్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం నర్సంపేట, నెక్కొండ మండలాల్లో పర్యటించి మోడల్ హౌస్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మోడల్ హౌస్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశించిన సమయంలో పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా మోడల్ హౌస్ నిర్మాణాలు చేపట్టాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో రాంరెడ్డి, నర్సంపేట ఎంపీడీవో శ్రీనివాస్ రావు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

## మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి అంబేడ్కర్ స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను జిల్లా యువజన, క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ పాండు హాజరై మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు కేవలం వినోదం మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యం, ఉల్లాసం, ఆహ్లాదంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విశిష్ట అతిథిగా జాతీయ స్థాయి క్రీడాకారుడు మహమ్మద్ జావిద్ అలీ పాల్గొని మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా ప్రతిభను, హాకీ రంగంలో ఆయన భారతదేశానికి సాధించి పెట్టిన ఖ్యాతిని వివరించారు. మరో గౌరవ అతిథి కూన వేణు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను చాటుతూ మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన ఖేలో ఇండియా క్రీడాకారులు కొర్రరాజు, జాడో చరణ్, కె.గీతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ హాకీ కోచ్ సాయి కుమార్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బి.శంకర్, రెజ్లింగ్ కోచ్ జైపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, సుభాష్‌గౌడ్, రామకృష్ణ, రామగౌడ్, కృష్ణయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, కరాటే సంఘం ప్రతినిధి చవాన్ చందర్, బాక్సింగ్ సంఘం ప్రతినిధి మహేష్, రెజ్లింగ్ సంఘం ప్రతినిధి విట్టల్ నాయక్‌తో పాటు ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెన్నచర్లలో దేవరపాగ భాస్కర్ దశదినకర్మకు హాజరైన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామ 3వ వార్డు మెంబర్ కీర్తిశేషులు దేవరపాగ భాస్కర్ దశదినకర్మ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మనసున్న భాస్కర్ ని కోల్పోవడం బాధాకరమని, ఆయనతో ఉన్న స్నేహం మరువలేనిదని అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బై రాములు, మాజీ సర్పంచ్ పగడాల చిన్నయ్య, మాజీ ఎంపీటీసీ డి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

## మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు

### జిల్లా యువజన, క్రీడల అధికారి బి. శ్రీకాంత్‌రెడ్డి



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను నిర్మల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాలతో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా హాకీ అసోసియేషన్ సహ ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి బి. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత హాకీకి ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన కృషి, ఆయన ప్రతిభ, అంకితభావం చిరస్మరణీయమని అన్నారు. ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.




క్రీడలు కేవలం పోటీలకే పరిమితం కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగం కావాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు క్రీడా కోటా ద్వారా ప్రభుత్వంతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను గుర్తించి క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రాథోడ్ లక్ష్మణ్, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రాంచందర్, పీడీలు రమణారావు, రవీందర్‌గౌడ్, అన్నపూర్ణ, భూమన్న, సత్తయ్య, బుచ్చిరామారావు, సుధార్‌సింగ్, పోశెట్టి, వంశీ, కె. శ్రీనివాస్, పీఈటీలు సంజీవ్, గంగాధర్, ముకేష్, భీమేశ్, గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ వెలుగులు , ఉచిత విద్యుత్ కనెక్షన్లతో ఎన్పీడీసీఎల్ సేవలు

## ఎస్ఈ ఉత్తమ్ జాడే...



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆసిఫాబాద్ సర్కిల్, సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. సర్కిల్ పరిధిలోని మొత్తం 879 అంగన్వాడి కేంద్రాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, ప్రీ-స్కూల్ కార్యకలాపాలు, ఆటలు, అభ్యసన కార్యక్రమాలు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలు సజావుగా నిర్వహించేందుకు విద్యుత్ సౌకర్యం ఎంతో దోహదపడుతుందని ఎస్ఈ తెలిపారు.

విద్యుత్ కనెక్షన్లు అందుబాటులోకి రావడంతో అంగన్వాడి కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి మోటార్లు, ఇతర విద్యుత్ పరికరాలు సక్రమంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. దీంతో చిన్నారులు వేడి, ఉక్కపోత వంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యా, అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనగలుగుతున్నారని తెలిపారు. అలాగే, అంగన్వాడి కార్యకర్తలు తమ విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యుత్ సౌకర్యం ఉపయోగపడుతుందని చెప్పారు. చిన్నారులకు పోషకాహారం తయారీ, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. చిన్నారుల సంక్షేమం, విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత అనుగుణంగా సర్కిల్ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తోందని ఎస్ఈ తెలిపారు. ప్రతి అంగన్వాడి కేంద్రం విద్యుత్ వెలుగులతో కళకళలాడేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

## మెదక్ డీసీసీబీ బ్యాంకు సిఈఓ ఎం.సురేష్



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** సంగారెడ్డి పట్టణంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీసీబీ సీఈవో ఎం.సురేష్ మాట్లాడుతూ పంట రుణాలపై వసూలు చేసిన ఒక శాతం ప్రాసెసింగ్ రుసుము, తనిఖీ రుసుముల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇటీవల ఎలక్ట్రానిక్, ముద్రిత మాధ్యమాల్లో వచ్చిన వార్తా కథనాల నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను రైతులకు తెలియజేసేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ), నాబార్డు మార్గదర్శకాలు, మారుతున్న బ్యాంకింగ్ విధానాలకు అనుగుణంగా 2025 జూన్ 12 నుంచి అక్టోబర్ 8 వరకు పంట రుణాలపై ఒక శాతం ప్రాసెసింగ్ రుసుము, తనిఖీ రుసుములు వసూలు చేసినట్లు వివరించారు. అయితే రైతులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాలు, కార్యదర్శుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని బ్యాంకు ఈ అంశాన్ని పునఃపరిశీలించిందని, అనంతరం 2025 అక్టోబర్ 8న జారీ చేసిన సర్క్యులర్ ద్వారా పంట రుణాలపై ఈ రుసుముల వసూళ్లను నిలిపివేసినట్లు తెలిపారు. అప్పటికే వసూలు చేసిన ప్రాసెసింగ్ రుసుము, తనిఖీ రుసుములను డీసీసీబీ--పీఏసీఎస్‌ల మధ్య అమల్లో ఉన్న వాటా విధానం ప్రకారం సంబంధిత ఖాతాల్లో నమోదు చేసినట్లు చెప్పారు. ఈ విధంగా జీఎస్‌టీతో కలిపి సుమారు రూ.87 లక్షలు డీసీసీబీకి, సుమారు రూ.70 లక్షలు పీఏసీఎస్‌లకు వాటా విధానం ప్రకారం జమ అయినట్లు వెల్లడించారు. డీసీసీబీతో పాటు పీఏసీఎస్‌లలో వసూలైన ఈ మొత్తాలను సంబంధిత సంస్థల ఇతర ఆదాయ ఖాతాల్లోనే జమ చేశామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత ఖాతాలకు మళ్లించలేదని సీఈవో స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతాదారులు, రైతులు ఈ అంశంపై ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని, వాస్తవాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

# విధినిర్వహణ ఎంత ముఖ్యమో ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యం

## వీక్లీ పరేడ్‌ను పరిశీలించిన పోలీస్ అధికారులు



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ సబ్‌డివిజన్లు, సర్కిల్ పరిధుల్లోని పోలీస్ సిబ్బందికి ఈ రోజు ఉదయం వీక్లీ పరేడ్ నిర్వహించారు. నిర్ణీత సమయానికి సిబ్బంది బేస్‌లైన్ ఫాలిన్‌లో పాల్గొని, అనంతరం పరేడ్ నిర్వహించారు.

నిర్మల్ సబ్‌డివిజన్ పరిధిలో నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్, నిర్మల్ రూరల్ సర్కిల్, సోన్ సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాస్ పరేడ్‌ను నిర్వహించగా, సీఐ కృష్ణ, సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్‌ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### భైంసా సబ్‌డివిజన్ పరిధిలో

భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి భైంసా టౌన్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. భైంసా లో రవీందర్ సీఐ పరేడ్‌ను నిర్వహించి సిబ్బంది ప్రదర్శించిన డ్రిల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్‌ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఖానాపూర్ సర్కిల్ పరిధిలో

ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో వీక్లీ పరేడ్ నిర్వహించారు. సీఐ సత్యనారాయణ పరేడ్‌ను నిర్వహించగా, ఎస్‌ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వీక్లీ పరేడ్ ద్వారా పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, సమన్వయం పెంపొందుతాయని తెలిపారు. విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండేందుకు శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు.



విధుల మధ్య సమయం దొరికినప్పుడల్లా వ్యాయామం చేయడం, ఫిట్నెస్‌ను నిరంతరం కాపాడుకోవడం ద్వారా మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చన్నారు. పోలీసులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని, చెడు వ్యసనాలు మరియు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు.

అదేవిధంగా వ్యక్తిగత, ఆరోగ్య లేదా విధులకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని అధికారులు సూచించారు.

వీక్లీ పరేడ్‌లో ఏ ఆర్ , డీసీరబీ , ఐటీ కోర్ , ఎస్బి, పీసీర్ , షీ టీం , భరోసా తదితర విభాగాల సిబ్బంది కూడా పాల్గొని పరేడ్, డ్రిల్ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

# కిషన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

## జిల్లా నలుమూలల నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలిరావాలి

## నేడు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న యు. రమేశ్ కుమార్



**తాండూరు అక్షిత ప్రతినిధి:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయడంతో పాటు వికారాబాద్ జిల్లాలో భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని, బీజేపీ వికారాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడు యు. రమేశ్ కుమార్ అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నియ మితులైన ఆయన శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా యు. రమేశ్ కుమార్ నేడు అధికారికంగా బాధ్యతలు స్వీక రించనున్నట్లు తెలిపారు. తాండూరులోని వీరశైవ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించ నున్న బాధ్యతల స్వీకార మహోత్సవానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతమ్ రావు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని, వెల్లడించారు.

జిల్లాలో బీజేపీకి మరింత బలమైన రాజకీయ పునాది ఏర్పాటు చేయడంతో పాటు రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని రమేశ్ కుమార్ తెలిపారు. ప్రజల సమస్యలను ప్రధాన అజెండాగా చేసుకుని ప్రతి మండలం, ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామని, అన్నారు. జిల్లాలో రాజకీయ సమీ కరణాలు మారుతున్న నేపథ్యంలో బీజేపీ ప్రజలకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని, తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజల పక్షాన బీజేపీ నిరంతరం పోరాడు తుందని స్పష్టం చేశారు.

### కిషన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పర్యటనకు జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని రమేశ్ కుమార్ పిలుపు నిచ్చారు. జిల్లా నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తాండూరుకు చేరుకుని బాధ్యతల స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని, కోరారు. ఈ కార్యక్రమం ద్వారా వికారాబాద్ జిల్లాలో బీజేపీకి ఉన్న ప్రజాబలాన్ని, పార్టీ శక్తిని చాటాలని ఆయన అన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల సహకారంతో సమష్టిగా పనిచేస్తామని, రమేశ్ కుమార్ తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాలను ప్రజలకు వివరించి పార్టీకి మరింత ఆదరణ తీసుకువచ్చేలా కృషి చేస్తామని, పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు బాలేశ్వర్ గుప్తా, విజయ్ కుమార్, కృష్ణ, బంటారం భద్రేశ్వర్, రజినీ కాంత్, ఇందూర్ రాములు, పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ నాగారం మల్లేశం, కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి, దోమ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల వినియోగం శాస్త్రీయ పద్ధతిలో వాడాలి

## కెవికె శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** ఎరువుల వినియోగం శాస్త్రీయ పద్ధతిలో వాడాలని కెవికె శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి జిల్లా మదనాపురం రైతు వేదికలో కొత్తకోట, మదనాపురం రైతులకు ఆర్‌పీఎల్ శిక్షణ కార్యక్రమం ఆత్మ ఆధ్వర్యంలో కెవికె సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కెవికె శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రధాన పంటలలో సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులు, నేల ఆరోగ్య యాజమాన్యంపై అవగాహన కల్పించారు. రైతులకు సమగ్ర పోషక యాజమాన్యం యొక్క ప్రాముఖ్యత, పంటలకు అవసరమైన పోషకాలను సమతుల్యంగా అందించడం, నేల సారాన్ని కాపాడుకోవడం, ఎరువుల సమర్థ వినియోగం తదితర అంశాలను వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఎరువుల వినియోగాన్ని శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని రైతులకు సూచించారు. అదేవిధంగా, కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్రేమవర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ ఎరువుల బుకింగ్ యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకునే విధానంపై ఏడీఏ షేక్ మున్నా రైతులకు సంబంధిత సిబ్బందికి అవగాహన కల్పించారు. రైతులు ఎరువుల బుకింగ్ ప్రక్రియను సులభంగా వినియోగించుకునేలా అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజనేయులు, డిపిడి ఆత్మ హైమావతి, కొత్తకోట మండల వ్యవసాయ అధికారులు జాస్మిన్, గాయత్రి, వ్యవసాయ విస్తరణ అధికారులు కేవీకే సిబ్బంది పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి

## ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి




**జడ్చర్ల ,అక్షిత న్యూస్:** నవాబ్‌పేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న షూ, టై, బెల్ట్‌లను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి నేడు విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, యూనిఫాం, షూ తదితర సామగ్రిని ప్రభుత్వం అందిస్తోందన్నారు. విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

అనంతరం నవాబ్‌పేట మండల కేంద్రంలో పేద, అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రజల సంక్షేమం, విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## భూ రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** దహెగాం మండలంలోని అమర్‌గొండ గ్రామంలో శరవేగంగా జరుగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

కలెక్టర్ గ్రామంలోని వ్యవసాయ భూముల అనుభవం గ్రౌండ్ ట్రూతింగ్ పనులు, గ్రామ పొలిమేర సరిహద్దులు, ఆవాస ప్రాంతాల సరిహద్దులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన భూములను స్వయంగా తనిఖీ చేసి, సర్వే పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేలో ఉపయోగిస్తున్న జి ఎన్ ఎస్ ఎస్ ,రోవర్ పరికరాల పనితీరును, కంట్రోల్ పాయింట్లను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ హరిత క్షేత్రస్థాయిలో సాంకేతిక పరికరాల వినియోగం మరియు ఖచ్చితత్వంపై సర్వే సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ మొత్తం విస్తీర్ణం, ప్రభుత్వ భూముల పరిమాణం, సంబంధిత సర్వే నంబర్లు మరియు రీ-సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక రైతులతో, గ్రామస్థులతో నేరుగా మాట్లాడి, రీ-సర్వేపై వారి అభిప్రాయాలు, వినతులు మరియు అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వే ప్రక్రియలో భూ సరిహద్దుల ఖచ్చితమైన నిర్ధారణ, రికార్డుల సమగ్ర పరిశీలన మరియు రైతుల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా, నిబంధనలు మరియు మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు వినయ్ కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రామేశ్వర్, మండల సర్వేయర్ ధన్‌రాజ్, సంబంధిత రెవెన్యూ మరియు సర్వే శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## కష్ట కాలంలో రూ. 20,000 సహాయం చేసి బాసటగా నిలిచిన మిత్రులు

### జెడ్పీ హెచ్ ఎస్ 2005 బ్యాచ్ పూర్వ విద్యార్థుల మానవత్వం



**నార్కట్‌పల్లి, అక్షిత న్యూస్:** కష్టం వచ్చినప్పుడు "మేమున్నాం" అని పలికే ఓ చిన్న ఓదార్పు గుండెంత ధైర్యాన్ని ఇస్తుంది. ఇటీవల భర్తను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న తమ తరగతి స్నేహితురాలు పర్రేపాటి కల్పన కుటుంబానికి జడ్పీహెచ్ఎస్ నార్కట్‌పల్లి 2005 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు అండగా నిలిచారు.

ఒకే బెంచీ పై కూర్చుని చదువుకున్న స్నేహం కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా, జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాల్లోనైన తోడుగా ఉంటుందని రుజువు చేశారు. మిత్రులందరూ కలిసి సేకరించిన □20,000 ఆర్థిక సాయాన్ని కల్పన కుటుంబానికి అందించి తమ ఉదారతను చాటుకున్నారు.

మిత్రుల ప్రేమ, ఆప్యాయతలు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయని, ధైర్యంగా ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. చదువుకున్న బడిని, కలసి చదివిన స్నేహాన్ని గుర్తుపెట్టుకుని ఆపదలో ఉన్న మిత్రురాలికి బాసటగా నిలిచిన 2005 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఐక్యత, మానవత్వం అందరికీ ఎంతో ఆదర్శనీయం అన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**అక్షిత ప్రతినిధి, మంచిర్యాల :** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను




సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్,అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓ. లకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించి 1 లక్ష 70 వేల 967 నోటీసుల జనరేట్ చేయబడి 32 వేల 183 నోటీసులు జారీ చేసి యాప్ లో వివరాలు నవీకరించడం జరిగిందని తెలిపారు. 394 నోటీసుల హియరింగ్ ప్రక్రియ పూర్తి చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియ నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, అన్ని మండలాల తహసిల్దార్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు పకడ్బందీగా రూపొందించాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్





**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** గ్రామాల స్థానిక అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ సమగ్ర అభివృద్ధికి పకడ్బందీగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలు, మండల స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, టెక్నికల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, పరిపాలన, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన శిక్షణలో ఇచ్చిన సూచనలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య రంగాలతో పాటు తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అవసరాలను గుర్తించాలని, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రణాళికల అమలులో నాణ్యత, పారదర్శకత, సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి మండలంలో గ్రామ పంచాయతీల వారీగా ప్లానింగ్ షెడ్యూల్ సిద్ధం చేసి, మండల స్థాయి ప్లానింగ్ బృందాల ఏర్పాటు వివరాలను సమర్పించాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

**ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టాలి:**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఫార్మ్ పాండ్స్, ట్రెంచ్‌లు, సోక్‌పిట్స్, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్, వాటర్ హార్వెస్టింగ్ వంటి పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.

జిల్లాలో కురిసే ప్రతి చుక్క వర్షపు నీటిని సాధ్యమైనంత వరకు జిల్లాలోనే నిల్వ చేసి, భూగర్భ జలాలను రీచార్జ్ చేసేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. రైతులు ఫార్మ్ పాండ్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చేలా అధికారులు అవగాహన కల్పించడంతో పాటు వారిని ప్రోత్సహించాలని సూచించారు.

రైతులకు కేవలం ఆదేశాలు ఇవ్వడం కాకుండా ఫార్మ్ పాండ్స్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని అన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్తులో బోర్లలో నీటి లభ్యత మెరుగుపడి పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు.

**క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేయాలి:**

ఎం.పి.డి.ఓ లు, ఎం.పి.ఓ లు, ఏ. పి.ఓ లు తమ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేయించాలని మధుసూదన్ నాయక్ అన్నారు. అవసరమైన చోట గ్రామసభలు నిర్వహించి, సర్పంచులు, ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు.

మండల స్థాయిలో అధికారుల మధ్య సమన్వయం మరింత పెరగాలని, ప్రతి గ్రామంలో జరుగుతున్న పనులు, వాటి పురోగతి, ఎదురవుతున్న సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.

కార్యక్రమంలో జెడ్.పి.సి.ఈ.ఓ, ఇంచార్జ్ డి.పి.ఓ వెంకట రెడ్డి, అదనపు డి . ఆర్.డి.ఓ వామన రావు, అన్ని మండలాల ఎం.పి.డి ఓ లు, ఎ.పి.ఓ లు, ఈ.సి లు, టి.ఎ లు తదితర అధికారులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## ప్రశాంత వాతావరణంలో కరీంనగర్ నగరపాలక సంస్థ

# సర్వసభ్య సమావేశం

**అజెండాలోని అన్ని అంశాలకు సభ ఆమోదం**

**నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు**

**మేయర్ కొలగాని శ్రీనివాస్**





**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మార్గదర్శకత్వం, సహకారంతో అభివృద్ధికి ప్రాధాన్యం కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం శనివారం ప్రశాంతమైన, సుహృద్భావ వాతావరణంలో విజయవంతంగా జరిగింది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు హాజరయ్యారు.

సమావేశంలో అజెండాలో పొందుపరిచిన అన్ని అంశాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. కార్పొరేటర్లు తమ తమ డివిజన్లలో నెలకొన్న ప్రజా సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల అవసరాలను మేయర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలకు సభ ఆమోదం తెలిపింది.

**"అభివృద్ధే ప్రధాన అజెండా"**

కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా సమావేశంలో చర్చలు జరిగాయి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ప్రజారోగ్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సభ్యులు చర్చించారు.

ప్రజల నుంచి వస్తున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని మేయర్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత, సమయపాలనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**పార్టీలకు అతీతంగా నగర అభివృద్ధి**

నగర అభివృద్ధే అందరి ఉమ్మడి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు.

**బండి సంజయ్ కుమార్ మార్గదర్శకత్వంతో మరింత అభివృద్ధి**

కరీంనగర్ నగర అభివృద్ధికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి " బండి సంజయ్ కుమార్" అందిస్తున్న మార్గదర్శకత్వం, సహకారం ఎంతో కీలకమని మేయర్ పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుబాటులో ఉన్న వివిధ పథకాలు, నిధులను సమర్థవంతంగా వినియోగించుకొని నగరానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రధాన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ఇతర మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు.

**"ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రథమ కర్తవ్యం" -- మేయర్ కొలగాని శ్రీనివాస్"**

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, "కరీంనగర్ నగర ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మన బాధ్యత. ప్రతి డివిజన్‌ను సమాన దృష్టితో అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. కార్పొరేటర్లు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సభ దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మార్గదర్శకత్వం, సహకారంతో కరీంనగర్‌కు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి కృషి చేస్తాం" అని అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన సమావేశం ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై నిర్మాణాత్మకంగా చర్చించి, అజెండాలోని అన్ని అంశాలకు సభ ఆమోదం తెలపడంతో సర్వసభ్య సమావేశం విజయవంతంగా ముగిసింది.

కరీంనగర్‌ను పరిశుభ్రమైన, సుందరమైన, ఆధునిక మౌలిక వసతులతో కూడిన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ ముందుకు సాగుతుందని మేయర్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అడిషనల్ కమిషనర్లు, వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీ బాలుడిపై టీచర్ పైశాచికత్వం

**ఆదిలాబాద్ జిల్లా బోథ్ వేదం పాఠశాలలో నర్సరీ బాలుడిపై టీచర్ అమానుషం**

**8 నిమిషాల పాటు కొట్టిన టీచర్**

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**




**అక్షిత బ్యూరో, అదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో అత్యంత అమానుష ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అక్షరాలు నేర్పించాల్సిన ఉపాధ్యాయురాలే కసాయిలా మారి, నాలుగేళ్ల చిన్నారిపై కర్కశత్వాన్ని ప్రదర్శించింది. బోథ్ మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో నర్సరీ చదువుతున్న రిత్విక్ రెడ్డి అనే బాలుడిని, ఏబీసీడీలు సరిగ్గా రాయడం లేదన్న చిన్న కారణంతో టీచర్ విచక్షణారహితంగా చితకబాదింది. చేతితో, కర్రతో ఏకంగా ఎనిమిది నిమిషాల పాటు ఆగకుండా ఆ పసివాడిపై దాడికి తెగబడింది. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన బాలుడు తీవ్రమైన చెవి నొప్పితో ఏడుస్తుండటం, చెంపలు, చెవి భాగం కమిలిపోయి వాపు రావడాన్ని గమనించిన తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఏమైందని ఆరా తీయగా, పాఠశాలలో టీచర్ కొట్టిందని ఆ పసివాడు ఏడుస్తూ చెప్పాడు. దీంతో ఆగ్రహం చెందిన తల్లిదండ్రులు, బంధువులు వెంటనే పాఠశాలకు చేరుకుని యాజమాన్యాన్ని నిలదీశారు. అనంతరం తరగతి గదిలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, టీచర్ చిన్నారిని విచక్షణారహితంగా కొడుతున్న దృశ్యాలు రికార్డై కనిపించడంతో అంతా నివ్వెరపోయారు.

ఈ దారుణ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బాలుడి తల్లిదండ్రులు, సీసీటీవీ దృశ్యాల ఆధారాలతో బోథ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాగ, పోలీసులు టీచర్, పాఠశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

చిన్నారిపై అమానుషంగా దాడికి పాల్పడిన సదరు టీచర్, పై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై కూడా చట్టపరమైన చర్యలు చేపట్టాలని పోషకులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## వన్నోజు వేణుగోపాల్‌కు నివాళులర్పించిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి. సత్యం సోదరుడు, కీర్తిశేషులు వన్నోజు వేణుగోపాల్ శనివారం ఉదయం 4 గంటలకు ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ వెంటనే వారి స్వగృహానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వి. సత్యం ని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వేణుగోపాల్ ఆకస్మిక మృతి బాధాకరమని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పగడాల చిన్నయ్య, మాజీ ఎంపీటీసీ డి. రవికుమార్, వెన్నచర్ల ఉపసర్పంచ్ బై రాముడు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## నిర్మల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన దీక్ష

**బకాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి**





**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు నిర్మల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో "బకాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా నిరసన దీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు దొడ్డికింది నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల బకాయి నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి నిధులను త్వరితగతిన విడుదల చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అనంతరం నిరసన దీక్షను నిమ్మరసం తాగి విరమించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షులు రాథోడ్ రమేష్ గారు, బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మ రాజు, సత్యం చంద్రకాంత్, జమాల్, దినేష్, బీజేవైఎం నాయకులు వెంకటేష్, హరీష్, జుట్టు దినేష్,విజయ్, ఉదయ్ గౌడ్, సృజన్, బంటి, చరణ్, దీక్షిత్, అనిల్, శ్రీకాంత్, మధు, ప్రణయ్, నాగరాజు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, బీజేపీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



## సైక్లింగ్ క్రీడతో శారీరక ఆరోగ్యం

**పర్యావరణ పరిరక్షణ**

**డాక్టర్ ఊట్కూరి నరేందర్ రెడ్డి**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ఆధునిక కాలంలో సైక్లింగ్ క్రీడకు ఆదరణ పెరుగుతోందని, ఈ క్రీడ వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహద పడుతుందని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ హానరరీ చైర్మన్ డాక్టర్ ఊట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్త నిర్వహణలో చేపట్టిన "రన్ అండ్ రైడ్" కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాభిమానులు, క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరు కనీసం 45 నిమిషాల పాటు శారీరక వ్యాయామం చేస్తూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. అన్ని వయస్సుల వారు సైక్లింగ్ చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలో సైక్లింగ్ క్రీడ పట్ల అవగాహన పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత సైకిల్ తొక్కడం తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. అతి త్వరలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైక్లింగ్ పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని, ఎంపికైన అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నెగ్గి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సైకిల్ ర్యాలీ కార్యక్రమం కోర్టు వద్ద ప్రారంభమై ఆర్ అండ్ బి చౌరస్తా, తెలంగాణ చౌక్, మంకమ్మ తోట, రాంనగర్, టెలీ-ఫోన్ క్వార్టర్స్ మీదుగా డ్యామ్ కట్టపై చేరి గేట్ల వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లయన్ మిట్టపెల్లి మహేందర్, లయన్ నార్ల వేణుగోపాల్, లయన్ మేకల అరవింద్ బాబు, లయన్ డాక్టర్ వద్లూరి శ్రీనివాస్, సైక్లిస్ట్ అఖిల్, లేక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సఫలం అయ్యారు.

## గుడిపల్లిలో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**గుడిపల్లి, అక్షిత ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం గుడిపల్లి గ్రామంలో నిర్వహించారు.గ్రామ రేషన్ డీలర్ పడాల సాయికుమార్ ఆధ్వర్యంలో మొదటి కార్డును సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా గోలి చిన్న రాములుకు అందజేశారు.గుడిపల్లి రేషన్ షాపుకు సంబంధించిన 976 స్మార్ట్ రేషన్ కార్డులను డీలర్ సాయికుమార్‌కు అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్మార్ట్ కార్డుల్లో హోలోగ్రామ్, ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, వాటర్‌మార్క్, యువిలోగో తదితర 9 రకాల భద్రతా ఫీచర్లు ఉన్నాయన్నారు.క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా కుటుంబానికి సంబంధించిన రేషన్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చన్నారు.స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని తెలిపారు.అర్హులైన పేద కుటుంబాలకు మనిషికి 6 కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అరవపల్లి శ్రీను, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి, ఇందిరమ్మ ఇండ్ల పనులు

# పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య**



**అక్షిత బ్యూరో, మంచిర్యాల :** ప్రభుత్వం చేపట్టిన జలసిరి, ఇందిరమ్మ ఇండ్ల పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లాలోని జైపూర్ మండలం కుందారం గ్రామ పంచాయతీలో జలసిరి కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న పంట కుంట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ నీటిమట్టాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పంట కుంట



పనులలో పాటించాల్సిన జాగ్రత్తలు, పనుల పురోగతి అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలోని వివిధ రిజిస్టర్లు, రికార్డులతో పాటు ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించి, ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన వ్యక్తులు సంబంధిత స్థాయి అధికారులను సంప్రదించి అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఎ.పి.ఓ., పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, టి.ఎ., క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీలపై ఎలాంటి వివక్ష, అణచివేత, వేధింపులు జరగకుండా చూడాలి

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ శామీర్ పేట్ డివిజన్ తూంకుంట లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరై ప్రశాంగించారు. ఎస్సీ, ఎస్టీల పౌరహక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, ఎస్సీ, ఎస్టీలపై ఎలాంటి వివక్ష, సామాజిక అణచివేత, దాడులు, వేధింపులు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం విలువలను పాటించాలన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా చట్టప్రకారం తక్షణమే స్పందించాలన్నారు. దాడులు, అవమానాలు, భూవివాదాలు, సామాజిక వివక్షకు సంబంధించిన ఫిర్యాదులపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పెండింగ్ భూములు, సంక్షేమ పథకాలు, పౌరహక్కుల ఉల్లంఘన కేసులను జిల్లా కలెక్టర్ తో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు కమిషన్ అండగా ఉంటుందని చైర్మన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్, ఆర్డిఓ వెంకట రెడ్డి, మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వివిధ రకాల క్రీడల పోటీలు నిర్వహణ



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** క్రీడల పోటీల నిర్వహణ విద్యార్థులకు ఒత్తిడి నుండి ఉపశమనం కలగడమే కాకుండా రోజు వారి ప్రక్రియల ఎదురవుతున్నటువంటి సమస్యలను సైతం అధిగమించవచ్చని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకగా నిర్వహించినటువంటి ప్రత్యేక వేడుకలను ఘనంగా ప్రారంభించారు

క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం తో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు జట్టుగా పనిచేసే తత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో చాటాలని ఆకాంక్షించారు అదే విధంగా విద్యార్థుల్లో క్రీడ స్ఫూర్తిని పెంపొందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ దిగ్గజ హాకీ క్రీడాకారుడు – హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్చంద్ జయంతిని పురిస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని వారు చెప్పారు వేడుకలలో భాగంగా విద్యార్థులకు పలు క్రీడల పోటీలను నిర్వహించడం జరిగినదని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల విద్యార్థులకు వాలీబాల్, ఫుట్బాల్, ఖో-ఖో, కబడ్డీ, హ్యాండ్ బాల్, వాలీబాల్ తదితర క్రీడల పోటీలను నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు